# కన్నీరు

యరబర్ల
శ్రీరామమూర్తి

మా రెడ్డి మాంచి రొమాంటిక్ పర్సను. ఆ రొమాంటిసిజాన్ని నవలలు చదవడంద్వారా, సినిమాలు చూడటం ద్వారా అలవరచుకున్నాడు.

తాను చదివే ప్రతినవలలోనూ, తన్నే నాయకునిగా వూహించుకొని, ఊహాకన్యతో, వూహాలోకంలో విహరిస్తూ, ప్రణయకేళిలో తేలుతూండేవాడు... సినిమాలను—అందులో ఇంగ్లీషు—వాటిని చూడకండా వదలిపెట్టింది ఒకటీలేదు. చిత్రాల్లోని తెల్లపిల్లల సన్నని నున్నని కాళ్ళను,... కొత్తగాయం రంగులా మెరసే పెదాలను... మెత్తని రింగుల జుత్తునుచూచి ముకిసిపోతూండేవాడు. చూచిన ప్రతి హీరోయిన్‌తోనూ, సరససల్లాపలాడుతూండేవాడు నిద్రలో... గ్రేటా కార్బో, టైరోర్ పవర్, బెట్టీగేబుల్—లాంటి అంతకత్తె భార్యగా దొరక్కపోతే బ్రహ్మచారిగావుండి పోవాలనే వాంఛించేవాడు... ప్రతిరోజూ సాయంత్రం సెంట్రల్ స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యేవాడు; అక్కడకు వచ్చే అమ్మాయిల అందాన్ని ఆఘ్రాణించి ఆనందించేందుకు. రాత్రి కాగానే రంగైన గుంటడై, కల్పిత కాంతలతో కలిసి తిరిగేవాడు. స్వాప్నిక లోకమే అతని యెడల స్వాభావిక లోకమైంది.

రెడ్డిగదిలేని నాయికి చిత్రజగత్తులోనే లేదు. ప్రతి హీరోయిన్ రెడ్డి గదిగోడమీద ప్రతిఫలిస్తూంటుంది. రోజుకొక్క హీరోయిన్‌తో రంజైన భాషలో మాట్లాడుతుంటాడు, కార్యక్రమం ప్రకారం...

కాలప్రవాహంలో ఇలా దినాలు కదలిపోతున్నాయి. ఇలా వుండగా తండ్రివద్దనుంచి వుత్తరం వచ్చింది———"......పెద్దవాడవయ్యావు. పెండ్లిచేసుకోవలసిన సమయం వచ్చింది... మీ అమ్మమ్మ నీ పెండ్లి కళ్ళారా చూడాలని పట్టుపట్టూంది......కడప రామిరెడ్డిగారి అమ్మాయిని ఖాయంచేశాను... రామిరెడ్డి బాగావున్న రైతు. ఒఖతే పిల్ల... బక్క పలచగా బాగానే వుంటుంది ...కాస్తోకూస్తో ఇంగ్లీషు చదువుకుంది. చక్కగ వంట చేస్తుంది... నేను చూశాను... కావాలంటే నీవుకూడా వెళ్ళి చూచిరా... వచ్చే ఆదివారం మంచిరోజు......"

ఉత్తరంలోని వర్ణను బట్టి కాబోయే భార్య రూపము ఊహించుకుంటున్నాడు... ఇంత వ్రాశాడు. కాని పిల్లపేరు వ్రాయలేదే!—పేరులోనే కదా మజా అంతా వుంది!... "వాట్ గ్రేటా, కార్బో, ఏమంటావు?"......పేరులోనేవుంది కదూ మజా అంతా!... గ్రేటా కార్బో! ఎంత చక్కని పేరు" అన్నాడు, ఎదురుగా తనవంకే చూస్తూ నిలుచున్న గ్రేటా కార్బో [ఫొటో]తో...

"ఈ వేళ మంగళవారం కదూ... బుధ, గురు, శుక్ర, శని... నాలుగురోజులు గడవాలన్న మాట, 'హిస్ హైనెస్' 'మా రాణి'ని చూచేందుకు... మా రాణి రంగుల రాణో? మసిబొగ్గుల రాణో?

అందంకోసం తహతహలాడే మనం అందవిహీనురాలిని చేసుకుంటామా? జంట టంచనుగా కుదిరితేనే జీవితంలో అందం ఆనందం! అంతేనా మై డియర్ గ్రేటా?......

కాబోయే భార్య ముక్కుతీరు... కళ్ళకాంతి... తొడలసొంపు......పిక్కల వంపు.....వూహించుకొంటూ ఎలాగో, కాలాన్ని వేగిరించాడు రెడ్డి... బుధ, గురు, శుక్ర శనివారాలు గడిచాయి... ఆదివారం కంటికిమ్మని నిద్రలేకుండా, కళ్ళు కాయలు కాచేలా యెదురుచూస్తూన్న—ఆదివారం వచ్చింది. ఆనందలక్ష్మిలాగా... మేకప్‌లో మునిగాడు—ఒఖ మాటలో చెప్పాలంటే, టిప్‌టాప్ సూట్‌తో తయా

తయారయ్యాడు రెండుగంటలు కష్టాలు పడి... "హలో గ్రేటా! వెళ్తున్నా...నీకు సవతిని తీసుకు రావడానికి... 'ఇద్దరి భార్యలు భర్త ఇరుక్కుచచ్చాడు' అన్నట్లు చేయకండేం......నా గ్రేటా కదూ! విచారం దేనికి? నిన్ను వదిలేస్తాననా? ఆరుసంద్రాలూ తల్లక్రిందులైనా అలా జరగదు... నిన్ను వదిలేసి నేను జీవించగలనా?...నా గ్రేటా కదూ...కన్నీరు కారుస్తారా... తప్పు...తప్పు... అంటూ జేబురుమాలతో గ్రేటా కార్బో పటాన్ని తుడిచాడు, కన్నీళ్ళు తుడిచినట్లుగా వస్తా...ఏది ఒఖముద్దు" అంటూ మనసారా పటాన్ని ముద్దెట్టుకున్నాడు..."చూడు గ్రేటా! నిన్ను ముద్దెట్టుకుంటూంటే మిగిలినవాళ్ళేలా నీరై చూస్తున్నారో... హలో డియర్స్! నమస్తే"...అంటూ అడుగు బైటపెట్టాడు రెడ్డి...

"Wish you good luck" అన్నట్లు గ్రేటో [ఫోటో] చూచింది.

దిగేవాళ్ళతో యెక్కేవాళ్ళతో కుస్తీపట్టూ, చెమటకు చట్నీ అయి కడప చేరుకున్నాడు సాయంత్రానికి కాబోయే భార్యను చూద్దామన్న దిలాసాతో...ఆ రాత్రే ఎదురు బొదురు చూపులయ్యాయి...కళ్ళకాంతిని, ముసుగులోంచి తోసుకువచ్చే చిరునవ్వును చూచి ముగ్ధుడయ్యాడు...కలల్లోని కాంత ప్రత్యక్షమైనట్లు కనుపించింది...ఊ అంటే ఊ అనుకున్నారు. వివాహం ఖాయమైంది. తన వాంఛలు నెరవేరబోతున్నాయి కదా అని తన్మయత్వం పొందాడు రెడ్డి...

తీయని తలపులతో తను అనుభవించబోయే ఆనందాన్ని తలచుకుంటూ, తెల్లావారేసరికల్లా లాడ్జికి వచ్చి చేరుకున్నాడు.

'ఏమయింది?' అని ప్రశ్నించిన పోజులోవున్న గ్రేటా [ఫోటో] కనిపించింది, తలుపు తెరిచీ తెరవగానే...

"హలో గ్రేటా! రజని [కాబోయే భార్య] నీకంటె అందంగా వుంది సుమా! అంటూ లజ్జగా బుగ్గను పుణికినట్లు, గ్రేటా [ఫొటో] బుగ్గను పుణుకుతాడు...... 'ఈ మాత్రానికే కోపమా?'...... మూతిబిగించుకున్నట్టు వూహించి గ్రేటాను బ్రతిమాలసాగాడు రెడ్డి...వూహా కాంతలందరికినీ 'విష్' చేసి, తండ్రికి వుత్తరం వ్రాసేందుకు కూర్చున్నాడు—

"మీ వుత్తరం ప్రకారం కడపవెళ్ళి రజినిని చూచి వచ్చాను...మీ ఇష్టం ప్రకారమే కానీయండి...వచ్చే పదిహేనో తారీఖుకే లగ్నం నిశ్చయించారు...అప్పటికి ఇంటికి వస్తాను——అని వుత్తరం పూర్తిచేశాడు...

రజనీకి గ్రేటాకు వూహాపోరాటాన్ని కల్పించి, తాను మధ్యవర్తి అయి, తీర్పు చెప్తూ, రజనీతో, సరసాల్తో రంజిలుతూ, గ్రేటాతో కొట్లాడుతూ, కాలం గడుపుతూండేవాడు. ఇలా కాలచక్రంలో ముప్పయిరోజులు గిర్రున తిరిగాయి...

స్త్రీ పురుషుడు—ఇచ్ఛవున్నా లేకున్నా—భార్యాభర్తలుగా కలిపేందుకు సమాజంలో 'వివాహం' అనే పేరుతో జరిగే తంతుపూర్తయింది,

రజనీరెడ్డి—భార్యాభర్తలయ్యారు...

మూడు నిద్రలయ్యాయి... మరునాడు శోభనం...అందీ అందకుండా వ్రేలాడకట్టబడిన మాంసం కోసం, తహతహలాడే పులిలా, పగలల్లా తహతహలాడిపోయాడు, ప్రొద్దెప్పుడు కుంకుతుందా అని రాత్రయింది... శోభనంగది... అందంగా అలంకరించబడింది. మంచం పట్టుగిల్ళతో మిలమిలలాడుతోంది...టేబిల్ మీద పళ్లు ఫలహారాలు ఎదురు చూస్తున్నాయి రెడ్డికోసం...రెడ్డి మంచంమీద కూర్చొన్నాడు...పేరంటాళ్ళు రజనిని గదిలోకి పెద్దపులిబోనులోకి మేకపిల్లను తోసినట్లు—తోసి తలుపేశారు...

(తరువాయి 24 వ పేజీలో)

(6 వ పేజీ తరువాయి)

ఎవరికీ మాట్లాడేందుకు నోరు పెగల్లా, ధైర్యం చేసి రెడ్డి పలకరించాడు...

'రజనీ'...గుండె వేగంగా కొట్టుకొంటూంది.

"......"

"రజనీ...నీవు నిజంగా రంభలాగుంటావు" —అన్నాడుతాను, పురాణాలు స్వర్గం అనే లోకంలో చాలా అందకత్తె అని వర్ణించబడ్డ రంభను చూచినట్లుగా రజని మాట్లాడలేదు సిగ్గుతో...

మంచం దిగాడు. మెల్లగా రజనిని సమీపించి. భుజాలమీద వణకుతూన్న చేతులను ఆనించాడు. రజని తలవంచునే వుంది...

"నిన్ను చూచింతర్వాత నీ కోసం ఎన్నో రాత్రులు నిదరలేకండా బాడపడ్డాను వెన్నెలకోసం చకోరంలా...రజనీ! ఇటు తిరుగు రజనీ! ... అబ్బా! ఎంతసేపని అలా నిలబడతావు...ఇలారా" అంటూ గోడవైపుకు తిరిగివున్న రజనీ ముఖాన్ని తనవైపు తిప్పుకున్నాడు...

దెయ్యంపట్టినవాడిలా తెల్లపోయి చూస్తున్నాడు రెడ్డి...ఈమె తాను చూచిన రజనీ కాదే! ఆమె ఎక్కడా? ఈమె ఎక్కడా? నక్కకూ నాగలోకానికీ పోలికా? కళ్ళకాంతి కాదు కనపడింది...స్ఫోటకం మచ్చలతో ముఖమంతా వికృతమైన రజని కనపడింది...

గుండె వేగంగా కొట్టుకోసాగింది...ఆశాలతలన్నీ కూకటివేళ్ళతో తెగిపోయాయి......ఆనంద రాగాన్ని ఆలాపించిన హృదయతంత్రులు. విచార రాగాన్ని ఆలాపించలేక పటుక్కున తెగాయి...

"అమ్మా!" అంటూ గుండెను చేత్తో గట్టిగా పట్టుకొని, క్రిందపడిపోయాడు రెడ్డి...వాడవలసిన మందులన్నీ వాడారు. మనోవైకల్యం మనోవైకల్యంగానే వుండిపోయింది......గాఢంగా వాంఛించే వాంఛ నెరవేరనప్పుడు మనోవైకల్యం సంభవించడం సహజం—ఎన్నిమందులు వాడినా ప్రయోజనం లేకపోయింది.

అలానే ఇంట్లో తిరుగుతూవుండేవాడు. ఇలా వుంటూ. వుంటూ, ఒకరాత్రి ఎలానో తప్పించుకుపోయాట్ట...ఇంటికి రాకండా వూళ్ళోనే తిరుగుతూ వున్నాడు: చేత గడ్డితోచేసిన బొమ్మవుంటుంది ఎప్పుడూ...'ఎవరు అది' అని ఎవరైనా ప్రశ్నిస్తే, 'నా రజని...నా భార్య' అంటూ, గట్టిగా నవ్వుతూ పారిపోతూంటాడు——అంటూ మా రెడ్డి విషాధ గాథను ఒక స్నేహితుడు చెప్తూండగా విని కన్నీరు కార్వడం తప్ప మరేం చేయలేకపోయాను.


## సుధాచంద్రిక

అన్ని శగలను ఒక్కరోజులో పోగొట్టును. శగ, మూత్రనాళమందలి మంట, చురుకు తగ్గించును. గనేరియా క్రిములను ఎంతకాలము నుండియున్నను సంహరించి వ్యాధిని మొదలంట నివారించును.

## చంద్ర

స్త్రీల బుతుశూల, బుతుబద్ధము, ఎరుపు, తెలుపు కుసుమలు, రజోదోషములను పోగొట్టి, ఆరోగ్యజీవనము నిచ్చును.

చంద్ర :—గర్భాశయరోగ నివారిణి.
అన్నిచోట్ల దొరకును.

## క్షీరసముద్రం ఫార్మసీ,
రాజమండ్రి.